
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 10 మార్చి 2024



'భవిత'కు అందని భత్యం

- విద్యార్థుల అవస్థలు
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- సుమారు రూ.60 లక్షల పెండింగ్



జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ చిన్నారులకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భత్యం సకాలంలో అందడం లేదు. దీంతో దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు ఆర్థిక అవస్థలకు గురవుతున్నారు. దివ్యాంగ విద్యార్థులు కూడా చదువుల్లో రాణించి వారిని ఉన్నత స్థితికి చేరాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం భవిత కేంద్రాలను నెలకొల్పింది. కానీ ఆయా కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు రెండేళ్లుగా ప్రయాణ భత్యం అందడం లేదు. ఫలితంగా వారు సొంత డబ్బులు పెట్టుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బులు సరిపోక, సమయానికి అందక పోవడంతో కొందరు చదువులు మానేస్తుండగా, మరికొందరు అడపాదడపా హాజరవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

జిల్లాలో భవిత కేంద్రాలు...

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా 19 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో మూడు కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మిగిలిన 16 కేంద్రాలు ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఇతర వాటిల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదుల్లో నిర్వహిస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి ప్రాంతాలల్లో భవిత కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. ఇందులో సుమారు 230 మంది దివ్యాంగ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలను సైతం అందిస్తున్నారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో 28మంది ప్రత్యేక ఉపాధ్యాయులు దివ్యాంగ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

దివ్యాంగుల కోసం ఎన్నో వసతులు..

జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు వారానికోసారి ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తారు. రోజూ స్కూల్ రెడీనెస్ కార్యక్రమం చేపడుతారు. పూర్తిగా అంగవైకల్యం ఉంటే ప్రతి శనివారం వారి ఇంటికి వెళ్లి పాఠాలు చెబుతున్నారు. వినికిడి సమస్య ఉంటే ప్రతి నెలా సదరం శిబిరాలకు పంపిస్తున్నారు. సాధారణ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు పాఠశాల సముదాయ సమావేశంలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరాలు పంపాము



రాజబాబు, భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయుడు

దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల్లో పూర్తి స్థాయి సేవలు అందిస్తున్నాం. విద్యార్థులకు గత ఏడాది రావాల్సిన బకాయిల కోసం ఉన్నతా ధికారులకు వివరాలు పంపాం. ఈ ఏడాది సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే వాటిని వారి వారి అకౌంట్‌లలో జమ చేసే అవకాశాలున్నాయి.

ప్రభుత్వం వేతనం పెంపుదల చేయాలి



రుద్ర అరుంధతి, భవిత కేంద్ర సహాయకురాలు

దివ్యాంగ విద్యార్థులకు విద్యను అందించడానికి ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో పనిచేస్తున్న అటెండర్లకు వేతనాలు పెంచాలి. కొన్ని సంవత్సరాలుగా నెల కు రూ. 3,500 అందిస్తున్నారు. ఉదయం కేంద్రం ప్రారంభానికి ముందు వచ్చి సాయంత్రం వరకు ఉంటూ దివ్యాంగులకు సేవలను అందిస్తున్నప్పటికీ వేతనాలు పెంచకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.

సుమారు రూ. 63 లక్షల భత్యం పెండింగ్...

జిల్లాలోని భవిత కేంద్రాలలో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగులకు ప్రతి నెల భత్యం అందించాల్సి ఉంటుంది. జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరం, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన భత్యం దివ్యాంగ విద్యార్థులకు అందలేదు. ప్రతి సంవత్సరం పది నెలల పాటు ఒక్కొక్కరి ఖాతాల్లో నెలకు రూ. 500 చొప్పున జమ చేయాల్సి ఉంటుంది. తల్లిదండ్రులకు స హాయ భత్యం కింద నెలకు రూ. 500 ఇవ్వాల్సి ఉంటుంది. బాలికలకు అ దనంగా నెలకు స్టైఫండ్ రూ. 200, రీడర్ అలవెన్స్ ఏడాదికి రూ. 600 చెల్లించాల్సి ఉంటుంది.. గత ఏడాదికి సంబంధించిన 12 నెలల రవాణా భత్యం సుమారు 230 మందికి సంబంధించి రూ. 27.60 లక్షలు, సహా యక భత్యం రూ. 27.60 లక్షలు, దివ్యాంగ బాలికలు సుమారు మందికి స్టైఫండ్ రూ. 4.80 లక్షలు, రీడర్ అలవెన్స్ సుమారు 200 మందికి సం బంధించి రూ. 4 లక్షలు రావాల్సి ఉంది. మొత్తం కలిపి సుమారు రూ. 63 లక్షలు రావాల్సి ఉంది.

ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా ముగుస్తున్నందున ఈ ఏడాదికి సంబంధించిన ప్రతిపాదనలు సైతం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అన్ని రకాల అలవెన్స్‌లు కలిపి దాదాపు రూ. 63 లక్షల వరకు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నా రు. అదేవిధంగా భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న అటెండర్లకు సైతం సంవత్సరాల తరబడి వేతనాలు పెంచకపోవడంతో ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. గత అయిదు, ఆరు సంవత్సరాలుగా నెలకు రూ. 3,500లు అందిస్తున్నారని, ప్రస్తుతం ఉన్న నిత్యావసర వస్తువుల ధరలకు అవి ఏమాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్నది వ్యాంగుల చిన్నారులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని తల్లిదండ్రులు, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

7లో..

- నలుగురు నిందితుల అరెస్టు..
- పరారీలో మరో ఇద్దరు



స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్లను చూపుతున్న ఎస్పీ

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎన్నమనేని ప్రకాష్ రావుతో పాటు 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు మోహన్, శ్రీనివాస్ ఉన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా సామాజిక సమ్మేళనం



ధర్మపురిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మపురి, మార్చి 9: ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఓబీసీ జిల్లా సామాజిక సమ్మేళనం శనివారం జరిగింది. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి కుల వృత్తుల కోసం విశ్వకర్మ యోజన పథకం తీసుకు వచ్చారని అన్నారు. ఈ పథకం కింద జీవనం కొనసాగించే 18 కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పథకం వల్ల కలిగే లాభాలు, ప్రాధాన్యత గురించి ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మరిపెల్లి సత్యం, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారు లక్ష్మణ్, బండారు సత్యనారాయణ, బీజేవైఎం పట్టణ అధ్య క్షులు గాజు భాస్కర్, కుమ్మరి తిరుపతి పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

రాయికల్, ఫిబ్రవరి 9: రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిని ఆనుకుని అయోధ్య గ్రామ శివారులో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ పగిలి నీరంతా వృధాగా పోతోంది. అధికారులు స్పందించి పైపులైన్‌ను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వృథాగా పోతున్న భగీరథ నీరు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్, రూరల్ మండలం తాటిపెల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలు మృతి చెందగా వారి కుటుంబాలకు మంజూరైన బీమా చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రత్నమాల, శంకర్, గంగారెడ్డి, మహేష్, దామోదర్‌రావు ఉన్నారు. అలాగే పట్టణంలోని గుట్టరాజేశ్వర స్వామి, 10వ వార్డులో ఉన్న అమర లింగేశ్వర స్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పిట్ట ధర్మరాజు ఉన్నారు.

చెన్నకేశవ ఆలయంలో జడ్జిల పూజలు



చెన్నకేశవనాథ ఆలయం వద్ద జడ్జిలు

రాయికల్, ఫిబ్రవరి 9: రాయికల్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవనాథ ఆలయంలో శనివారం జిల్లా జడ్జి నీలిమ, సికింద్రాబాద్ జిల్లా జడ్జిలు హన్మంత రావు, ఆశాలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. వీరి వెంట ఆలయ నిర్వాహకులు తుమ్మల సదాశివా రెడ్డి, గంప ఆనందం, శంకర్, రాజరెడ్డి, అర్చకులు సతీష్ శర్మ ఉన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, మార్చి 9: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ప్రొటోకాల్ చిచ్చు

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



జగిత్యాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల తోపులాట

జగిత్యాలరూరల్, మార్చి 9 : జిల్లా కేంద్రంలోని రూరల్ తహసీ ల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వర్గీయుల మధ్య ప్రొటోకాల్ విషయమై వాగ్వాదం చోటుచేసుకుంది. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వవిప్ లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత స్థానిక నాయకులు, పాల్గొన్నారు. స్టేజీపైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఉన్న క్రమంలో ఇరుపార్టీల నాయకుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పేదింటి ఆడపిల్ల పెళ్లికి లక్షతోపాటు తులం బంగారం ఇచ్చేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆడువాల జ్యోతి సూచించారు. అసలు విధివిధానాలు తెలియకుండా ఎలా దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నించారు. అయితే వారికి కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుజెప్పారు. దీంతో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. మరోవైపు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే సంజయ్ ఫొటో లేకపోవడం పట్ల బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఇరువర్గాల వాగ్వాదంతో కొంతసేపు చెక్కుల పంపిణీ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

చీరల పంపిణీ పై కాంగ్రెస్ శ్రేణుల అభ్యంతరం..

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ అనంతరం బీఆర్ఎస్ నేతలు చీరలను పంపిణీ చేశారు. ప్రతిసారి కల్యాణలక్ష్మి చెక్కుతోపాటుగా ఎమ్మెల్యే సొంత ఖర్చుతో లబ్ధిదారులకు చీరను కానుకగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నది. కానుకగా ఇచ్చే చీరను ఉంచిన కవర్‌పై కేసీఆర్ ఫొటోతో పాటు ఎమ్మెల్యే ఫొటో ఉండటంతో కాంగ్రెస్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో చీరలు ఉన్న కారును పోలీసులు అదుపులోకి తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తమకు చీరలు ఇచ్చిన తర్వాత కారును తీసుకెళ్లాలని మహిళలు అడ్డుకున్నారు.

సభకు విద్యుత్ అంతరాయం..

జగిత్యాల రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి కల్యాణలక్ష్మీ సభకు వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

జగిత్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఓ అధికారి సభ జరగుతుండగానే రీల్స్ చూస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పత్తాలేని చెత్త బండ్లు

- పడకేసిన పారిశుధ్యం
- కంపు కొడుతున్న కాలనీలు





ఇళ్లలో పేరుకుపోయిన చెత్త...రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను కాల్చుతున్న పట్టణ ప్రజలు

రాయికల్, మార్చి 9: రాయికల్ పట్టణంలో మున్సిపల్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో రోడ్లపై చెత్త, డ్రైనేజీల్లో మురుగు పేరుకు పోయి కాలనీలు కంపు కొడుతున్నాయి. విస్తరిస్తున్న పట్టణానికి అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన మున్సిపల్ అధికారులు గ్రామ పంచాయతీ ఉన్నప్పటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చెత్త బయట వేస్తే జరిమానా విధిస్తా మంటున్న అధికారులు వారానికి ఒకసారి కూడా చెత్తబండి రాకపోవ డంతో ఇళ్లల్లోని చెత్త ఎక్కడ వేయమంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో మొత్తం ఆరు చెత్త తీసుకువెళ్లే ఆటోలు, మూడు ట్రాక్టర్లు ఉండగా ఇప్పటికీ ఒక్కసారి కూడా అన్ని వాహనాలు రోడ్డెక్కిన దాఖలాలు లేవు. ఎప్పుడు ఒకదానికి మరమ్మతులు చేయడం పరిపాటి. ప్రస్తుతం రెండు వాహనాలతో చెత్త సేకరణ చేస్తున్నారు.

12 వార్డులకు రెండు వాహనాలు ఎలా సరిపోతాయో పాలకవర్గానికే తెలియాలి.

డ్రైనేజీల్లో పేరుకుపోతున్న చెత్త

మున్సిపాలిటీలో గతంలో 50 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా, ఇందులో నుంచి జీతాలు ఇవ్వలేమని 27 మందిని తొలగించారు. దీంతో పారిశుధ్య నిర్వహణ ఇబ్బందిగా మారింది. మరల ముగ్గురిని విధుల్లోకి తీసుకుని 26 మందితోనే పనులు చేయిస్తున్నారు. సరిపడా కార్మికులు లేకపోవడంతో 20 రోజులకు డ్రైనేజీ చెత్త తొలగింపు ప్రక్రియ చేస్తున్నరు. దీంతో కాలనీలో దుర్గంధం రాజ్యమేలుతుంది. పట్టణవాసుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా అధికారులు చొరవ చూపి పారిశుధ్య కార్మికులను నియ మించేలా చర్యలు తీసుకుని రోగాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య నిర్వహణకు నిధుల కొరత..



జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్

నిధుల కొరతతో జీతాలు ఇవ్వలేక పారిశుధ్య కార్మికులను తొలగించారు. త్వరలో జరిగే పాలకవర్గ సమావేశంలో చర్చించి కలెక్టర్ అనుమతితో పారిశుధ్య కార్మికులను మరల తీసుకుంటాం. పట్టణ ప్రగతి నిధులు విడుదలైతే పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. చెత్త వాహనాలను కూడా నిత్యం కాలనీల్లో తిరిగేలా చర్యలు తీసుకుంటాము.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 9: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గొడిశాల శేఖరయ్య అనే గీత కార్మికుడు శనివారం తాటి చెట్టు పైనుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వృత్తిలో భాగంగా శేఖరయ్య తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో జారి కిందపడి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.10వేల నగదు, బంగారం అపహరణ

కోనరావుపేట, మార్చి 9: కోనరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదుతో పాటు బంగారం అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సామ నరసింహారెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కూరగాయలను అమ్మడానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి పదివేల రూపాయల నగదు, అర్ధతులం బంగారం అపహరించారు.

నరసింహారెడ్డి కూరగాయలు అమ్మిన అనంతరం రాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి కిటికీ నుంచి గుర్తు తెలియన వ్యక్తి వచ్చి బీరువా పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు గుర్తిం చాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో ముదురుతున్న సంక్షోభం

● పార్టీ నుంచి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్

వేములవాడ, మార్చి 9: వేములవాడ పురపాలక సంఘం పరిధిలో బీఆర్ఎస్ పార్టీలో సంక్షోభం ముదురుతోంది. శాసనసభ ఎన్నికలలో ఓటమితో ఇప్పటికే ఆ పార్టీ కార్యకర్తలలో మనోధైర్యం దెబ్బతినగా, ఎన్నికల అనంతరం ఆ పార్టీ కౌన్సిలర్లు కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఆ పార్టీకి మరింత తలనొప్పిగా మారి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్‌కు దారితీసింది. మార్చి 7వ తేదీన జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారం కుమార్ ఓటమిపాలయ్యారు. సొంత పార్టీకే చెందిన కౌన్సిలర్లు పార్టీ విప్‌ను కూడా ధిక్కరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి మహేష్‌కు ఓటు వేశారు. దీంతో మారం కుమార్‌కు ఓటమి తప్పలేదు. ఈ ఎన్నికపై పోస్టుమార్టం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసి బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించారంటూ రెండు మిద్దెల జయ(2వ వార్డు), యాచమనేని శ్రీనివాసరావు(11వ వార్డు), జడల లక్ష్మి(5వ వార్డు), మధు రాజేందర్ శర్మ(23వ వార్డు), ముప్పిడి సునంద(26వ వార్డు)లను బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన మిగతా వారిపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. అయితే ఈ ఐదుగురు కౌన్సిలర్లు టిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని భావించి వారిని పార్టీ నుంచి ఆగమేఘాలపై సస్పెండ్ చేసినట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా టీఆర్ఎస్ పార్టీకి తామే రాజీనామా చేస్తున్నామని మున్సిపల్ కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, మధు రాజేందర్ శర్మ, జడల లక్ష్మి, ముప్పిడి సునంద ప్రకటించారు. వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో పార్టీ కౌన్సిలర్ల నుండి అభిప్రాయాలు సేకరించలేదని, అభ్యర్థి ఎంపిక విషయంలో కనీస విధివిధానాలు పాటించలేదని వారు ఆరోపించారు. ఏకపక్ష విధానాలతో వ్యవహరిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్న తీరుకు నిరసనగా తాము బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని వారు ప్రకటించారు. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నుంచి ప్రారంభమైన రాజీనామాలు, వలసలు రోజురోజుకు పెరుగుతుండడం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. టీఆర్ఎస్ పార్టీలోని మరికొందరు కౌన్సిలర్లు సైతం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని స్థానిక రాజకీయ వర్గాలలో జోరుగా చర్చ సాగుతోంది.

తాట్లవాయి హత్యపై వీడిన మిస్టరీ?

● పోలీసుల అదుపులో నిందితుడు? ● కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడి హత్య మిస్టరీని పోలీసులు శనివారం చేధించినట్లు తెలిసింది. ఈ హత్యకు పాత కక్షలే కారణమని, హత్యకు పాల్పడిన వ్యక్తి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుని ఆచూకీ తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని హత్య మిస్టరీని చేధించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి, నిందితుడి సెల్‌ఫోన్‌ను హతుడి వ్యవసాయ బావిలో నుంచి పోలీసులు శనివారం బయటకు తీసినట్లు సమాచారం. ఈ హత్యకు పాల్పడిన వ్యవహారంలో ఎందరి పాత్ర ఉందోనని పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది.

మహిళ దారుణ హత్య

● నిందితుల కోసం పోలీసుల గాలింపు

వీర్నపల్లి, మార్చి 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామానికి చెందిన శివరాత్రి మల్లవ్వ (42)ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వచ్చి హతమార్చినట్లు భావిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్‌లు సైతం పసిగట్టని విధంగా మహిళ మృతదేహంతో పాటు ఇంటి పరిసరాల్లో కారంపొడి చల్లి దుండగులు పరారయ్యారు.



మల్లవ్వ (ఫైల్)

కిరాతక హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పలువురు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లవ్వ కొంతకాలం క్రితం భర్తతో విడాకులు తీసుకుని తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇద్దరు కుమారుల్లో ఒకరు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరో కుమారుడు శేఖర్ తంగళ్లపల్లిలో కూలి పని చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. తల్లిగారి ఇంటి వద్ద ఒంటరిగా నివాసం ఉంటున్న మల్లవ్వను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పథకం ప్రకారం అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు ఇద్దరు అర్ధరాత్రి పూట రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని మల్లవ్వ వివరాలు అడిగినట్లు సమాచారం. అర్ధరాత్రి ఒంటరిగా ఇంట్లో నివసిస్తున్న మల్లవ్వను గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లవ్వను హత్య చేసిన దుండగులు శరీరంపై కారం చల్లి ఆనవాళ్లు గుర్తు పట్టరాకుండా చేసి పరారయ్యారు. శనివారం ఉదయం అటుగా వచ్చిన గ్రామస్థులు మల్లవ్వ మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. నిందితుల కోసం ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, వీర్నపల్లి ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐలు జునైద్, సాయికిరణ్, పోలీస్ ప్రత్యేక బృందం గాలింపు కొనసాగిస్తోంది. మృతురాలి తమ్ముడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ మహాసభలు

సుభాష్‌నగర్, మార్చి9: జిల్లా కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటెటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న న్యాయమైన పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.మందులపై ధరలను తగ్గించాలని, జీఎస్టీని తొలగించాలని, నాసిరకం మందులను అరికట్టాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధించాలని మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న పోరాటాలను ఆయన కొనియాడారు. అనంతరం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కె రమేశ్‌సుందర్ మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ ఆక్ట్-1976ను పరిరక్షించాలన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్‌లకు చట్టబద్ధమైన పనివిధానాలను కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మా రంగంలో జరుగుతున్న అనైతిక కార్యక్రమాలను ఉమ్మడి పోరాటాలతో అరికట్టాలన్నారు. అనంతరం తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు భట్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపి వేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ కరోనా కాలంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేసిన సేవలను కొనియాడారు. ఈ మహాసభలో ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ నాయకుడు రాంమోహన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకుడు సత్యనారాయణరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకుడు తిరుపతి, ఐద్వా నాయకురాలు నాగమణి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు రామరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు స్వామి, రాజు, రాజమల్లు, సురేష్, రాజేశం, ఎఫ్ఎంఆర్ఏఐ సహాయ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, టీఎంఎస్ఆర్‌యూ అధ్యక్షుడు భానుకిరణ్, సహాయ కార్యదర్శి నాగేశ్వర్, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు సిహెచ్ శ్రీధర్, సదానందచారి, కె ఐలయ్య, సయ్యద్‌సిద్దిక్, ఎం అంజయ్య పాల్గొన్నారు.

వెళ్లొస్తాం..రాజన్నా

● వేములవాడలో ముగిసిన మహాశివరాత్రి జాతర ● తిరుగు ముఖం పట్టిన భక్తులు

వేములవాడ మార్చి 9: 'ఆపదమొక్కుల రాజన్న దయ ఉంచు.. వచ్చే సంవత్సరం జాతరకు మళ్లీవస్తాం' అంటూ రాజరాజేశ్వర స్వామి భక్తులు వేములవాడ నుంచి తిరుగు ముఖం పట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి జాగరణ పాటించిన భక్తులు తెల్లవారుజామునే ఉపవాసం విడిచారు. పలువురు భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు. అనుబంధాలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అభిషేక పూజలో మంత్రి, ప్రముఖులు

మహా శివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో నిర్వహించిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం రోజున రాజరాజేశ్వర స్వామి వారి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో పాల్గొంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారులు కృష్ణభాస్కర్, లక్ష్మీ పార్థసారథి, ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు లింగోద్భవ పూజలో పాల్గొన్నారు.

అనంతరం శనివారం తెల్లవారుజామున వీరికి అర్చకులు ఆశీర్వచనం గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో డి కృష్ణప్రసాద్, ఏఈఓ హరికిషన్, ఆర్డీఓ రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

జాతర విజయవంతం : విప్ ఆది శ్రీనివాస్

అందరి సహకారం, సమన్వయంతో మహాశివరాత్రి జాతర విజయవంతమైందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడగలిగామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించిందన్నారు. జాతర విజయవంతంగా జరగడానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంతో సహకరించారని, జాతర ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందజేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ పర్యవేక్షణ చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులకు విప్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్టీసీ సంస్థ దాదాపు 400 బస్సులను కేటాయించి 3వేల ట్రిప్పులు నడిపిందని అన్నారు. దాదాపు 3 లక్షలకు పైగా మంది భక్తులు తరలి వచ్చి రాజన్నను దర్శించుకున్నారని వివరించారు.

జాతర సందర్భంగా రాజన్న ఆలయ ఆర్జిత సేవల ద్వారా తొలిరోజు ఏడవ తేదీ 24 లక్షల 22 వేల 392 రూపాయలు, రెండవ రోజు ఎనిమిదవ తేదీ 74 లక్షల 6 వేల 600 రూపాయల ఆదాయం సమకూరిందని ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు.



వేములవాడ నుంచి తిరిగి వెళ్తున్న భక్తులు

భక్త జనంతో కిక్కిరిసిన దుబ్బరాజన్న క్షేత్రం

సారంగాపూర్, మార్చి 9: మండలంలోని శ్రీ దుబ్బ రాజన్న క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మహా శివరాత్రి ఉపవాసాలతో జాగరణ చేసిన భక్తులు ఉదయాన్నే కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్‌లో నిలబడి స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులు గండదీపం, కోడెమొక్కులు, తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్వామి వార్లకు అన్న ప్రసాదం, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ధర్మపురిలో రాజేశ్వరుడి రథోత్సవం

ధర్మపురి, మార్చి 9: ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి, శ్రీ రామ లింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబ శివుని రథోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య శివ పార్వతుల ఉత్సవ మూర్తులను రథాలపై ఆశీనులు చేశారు. అనంతరం శ్రీ అక్కపెల్లి ఆలయం నుంచి నంది విగ్రహ చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణం జరిపారు. జైనాలో స్వామివారల సేవను ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.





వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



దుబ్బరాజన్న ఆలయంలో అన్నప్రసాద అలంకరణలో స్వామివారు, భక్తులు



ధర్మపురి శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

● నలుగురు నిందితుల అరెస్టు ● పరారీలో మరో ఇద్దరు

జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ రూ. లక్షలు గడిస్తున్న ఓ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును జగిత్యాల పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి వద్ద వివిధ విశ్వ విద్యాలయాలు, బోర్డుల పేరిట సృష్టించిన 395 నకిలీ సర్టిఫికెట్లు, ఒక కంప్యూటర్, ఒక ల్యాప్ టాప్, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన కొడితెల మహేశ్ అనే యువకుడు ఇటీవల గల్ఫ్ దేశం వెళ్లడానికి పాస్ పోర్టు కోసం ప్రయత్నం చేశాడు. పాస్‌పోర్టు దరఖాస్తుతో జతపరచడానికి పదో తరగతి సర్టిఫికెట్ అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందును సంప్రదించాడు. తన సమీప బంధువు అయిన కరీంనగర్‌కు చెందిన బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లు ఎవరికి అనుమానం రాకుండా నకిలీ సర్టిఫికెట్లు ఇస్తారని మహేశ్‌కు చంద్రయ్య సమాచారం అందించాడు. దీంతో చంద్రయ్య సహాయంతో మహేశ్ కరీంనగర్‌లోని రజిత, శ్రావణ్ కుమార్‌లను సంప్రదించగా రూ. 28 వేలకు ఒప్పందం కుదుర్చుకొని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, రూల్ నంబరు (16007125873) గల ఓపెన్ ఎస్ఎస్‌సీ నకిలీ సర్టిఫికెట్‌ను అందించారు. సదరు సర్టిఫికెట్‌తో పాస్‌పోర్టు కోసం మహేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. ధర్మపురి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ నర్సింగ్ రావు జరిపిన విచారణలో అది నకిలీ సర్టిఫికెట్‌గా గుర్తించారు. ఈ వ్యవహారాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు జగిత్యాల పోలీసు ఉన్నతాధికారులకు వివరించడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మపురి పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం మరింత లోతుగా విచారణ జరపడంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. కరీంనగర్‌కు చెందిన రజిత, శ్రావణ్ దంపతులు సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో తమకు జస్ట్ డయల్ ద్వారా పరిచయమైన పశ్చిమ



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

బెంగాల్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌ల సహాయంతో సుమారు ఐదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌కు రూ. 30 వేలు, డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ. 40 వేలు, ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌కు రూ.50 నుంచి రూ.60 వేలు వసూలు చేస్తూ కోరుకున్న సంవత్సరంలో కోరుకున్న పేరు మీద సూచించిన యూనివర్సిటీ, బోర్డుల పేరిట సృష్టించి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. సుమారు ఐదేళ్ల కాలంలో సుమారు 395 నకిలీ సర్టిఫికెట్లు విక్రయించి సుమారు రూ. 15.41 లక్షలు వసూలు చేసినట్లుగా పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో కరీంనగర్‌లోని రాంనగర్ కాలనీలో సొంతింట్లో నివాసమున్న బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లను, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలోని నివాసంలో కొడిచాల మహేశ్, కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 395 నకిలీ సర్టిఫికెట్లు, 5 మొబైల్ ఫోన్లు, రూ. 25 వేల నగదు, ఒక ల్యాప్ టాప్, ఒక కంప్యూటర్ సీపీయూ, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బరహంపూర్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయం

కరీంనగర్ టౌన్, మార్చి 9: టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 21శాతం పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయమని ఐఎన్‌టీయుసీ అనుబంధ ఎస్‌డబ్ల్యూయు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. యూనియన్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మహమూద్, రాజిరెడ్డి కృషి ఫలితమేనని ఐఎన్‌టియుసీ రాష్ట్ర వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ జక్కుల మల్లేశం గౌడ్, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు టీఆర్‌రెడ్డి, ఎన్‌కె రాజు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు , ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముస్తాబాద్, మార్చి 9: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు యాదయ్య (54) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదయ్య అనే రైతు తన పొలానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలలుగా ఫ్యూజ్ వైరు పడిపోతుంది. దీంతో పొలానికి నీరు సరిగా అందకపోవడంతో శుక్రవారం రాత్రి ఫ్యూజ్ వైరు సరిచేయాలని యాదగిరి ట్రాన్స్‌పార్మర్ బంద్ చేసి ఫ్యూజ్ వైరు సరిచేసే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యాదగిరి మృతిచెందాడు. సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. యాదగిరికి భార్య లక్ష్మీ, కూతుళ్ల దేవలక్ష్మీ, రమణ, కొడుకులు శేఖర్, రమేశ్ ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయం

రామడుగు, మార్చి 9: గ్రామీణ ప్రాంతాల్లో అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయమని, భారతదేశ ఔన్నత్యం, ఆశయాలకు జాతీయజెండా ప్రతిరూపమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేటలో జాతీయజెండాను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 56ఫీట్ల అతిపెద్ద జాతీయ జెండాను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. 77ఏళ్లుగా జాతీయజెండా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. జాతీయ జెండాలో మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోష్, భగత్‌సింగ్, సావర్కర్ వంటి వారు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన నేతల త్యాగాలు గుర్తుకు వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మండలంలోని గోపాల్‌రావుపేటలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో అతిపెద్ద జాతీయ జెండా దేశం గర్వించేలా ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, సంఘం అధ్యక్షులు కాసారపు పరుశరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.



జాతీయజెండాకు వందనం చేస్తున్న ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై పర్యవేక్షణ ఏదీ?

● ఓవర్‌లోడ్‌తో ప్రయాణాలు.. పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 9: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై రవాణా, పోలీసు ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో వాహనాల ఓవర్‌లోడ్, అతి వేగం తదితర నిబంధనలు విస్మరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయిదేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలతో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు. ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు 1.2 కి.మీ. ఉండగా, గతంలో జరిగిన ప్రమాదాలు దృష్ట్యా, నిబంధనల మేరకు మలపులతో కూడుకొని ఘాట్‌రోడ్డు 2.5 కిమీ.ఉంటేనే రాకపోకలకు అనుకూలమని ఇంజనీరింగ్ అధికారులు మరో ఘాట్‌రోడ్ కోసం సర్వే చేసి కొత్త రోడ్డుకు 3.6 కి.మీ మేర ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇంత వరకు ఆ ప్రతిపాదనలపై చర్యలు కనిపించడం లేదు. 2018 సెప్టెంబర్ 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాద అనంతరం రాకపోకలను నిషేధించిన అధికారులు 2022 జూన్27న నిబంధనలతో కూడిన అనుమతులు ఇచ్చారు. 20స్పీడ్ లోపే వాహనాలను నడుపాల్సి ఉంటుంది. కండీషన్ గల కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. భారీ వాహనాలైన బస్సులు, లారీలు, మినీబస్సులు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలకు అనుమతి లేదు. ఓవర్‌లోడ్(ప్రయాణికులు, ఇతరాత్ర)తో వచ్చే ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదు. కిందకు వచ్చే వాహనాలు గేరులోనే రావాలి. న్యూట్రల్‌లో రాకూడదనే నిబంధనలున్నాయి.



ప్రమాదకరంగా ఉన్న కొండగట్టు ఘాట్‌రోడ్డు

ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా - 11మందికి గాయాలు

కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం మ్యాదరిపేటకు చెందిన గందం జగన్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో శనివారం ఘాట్‌రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న 12 మందిలో 11మందికి గాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అంజన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డు మీదుగా కొండ దిగుతుండగా అదుపు తప్పిన ఆటో బోల్తాపడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో గల అర్విండ్, చంద్రయ్య, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో పరిమితికి మించి ఉండడం, న్యూట్రల్‌లో రావడంతోనే ఆటో అదుపు తప్పినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. గాయపడిన వారంద రినీ చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

మల్యాల, మార్చి 9: ఈ నెల 12న కరీంనగర్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే బహిరంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎన్నికల ఇన్‌చార్జీ పన్యాల భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. మల్యాలలో శనివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కొండ పల్కుల రామ్మోహన్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, సాగర్‌రావు, మధుసూధన్‌రావు మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ తైదల శ్రీలత, నాయకులు కొంక నర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

'కరీంనగర్ కదనభేరి విజయవంతం చేయండి'

కొడిమ్యాల, మార్చి 9: ఈ నెల 12న కరీంనగర్ పార్లమెంట్ స్థాయిలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించు భారీ బహిరంగ సభను (కదనభేరి) విజయవంతం చేయాలని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఎన్నికల ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కోరారు. శనివారం మండలంలోని నాచుపల్లి బృందావనం రిసార్టులో కొడిమ్యాల మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు ఇద్దరు వేర్వేరుగా మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, కొడిమ్యాల, తిర్మలాపూర్ సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రాజేందర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రసాద్, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ లింగాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, ఎంపీటీసీ మహేష్, నాయకులు రాజేశం, మహేష్, రమేష్, స్వామి, మహేందర్, సత్యం, పలువురు మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

హోరా హోరీగా ఎడ్ల బండ్ల పోటీలు



వెంకటాపూర్‌లో ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వెల్గటూర్, మార్చి 9: మండలంలోని వెంకటాపూర్‌లో శనివారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రతీ సంవత్సరం శివరాత్రి మరుసటి రోజు స్వయంభూ కట్ట రాజేశ్వరస్వామి ఆలయం వద్ద ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఎడ్ల బండ్ల పోటీలకు ఇతర జిల్లాల నుంచి వచ్చి పాల్గొనడం విశేషం. ఎడ్ల బండ్ల పోటీలను చూడడానికి బీరుసాని, స్తంభంపల్లి, లొత్తునూర్ గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. ప్రథమ బహుమతిని గుల్లకోటకు చెందిన దావుల అరవింద్ గెలుచుకోగా వెంకటాపూర్‌కు చెందిన మెరుగు వెంకయ్య అండ్ సన్స్ పావు తులం బంగారం అందజేశారు. రెండో బహుమతి తిరుమలాపూర్‌కు చెందిన షేక్ అయాన్ గెలువగా గుర్రపు కొమురయ్య 10 తులాల వెండి అందజేయగా, మూడవ బహుమతి చెర్లపెల్లికి చెందిన మాదాసు వెంకటశివ, తిరుమ లాపూర్‌కు చెందిన షేక్ భాషమియా గెలువగా చింత మల్లీశ్వరి, అనుశ్రీలు 8 తులాల వెండి బహుకరించారు. అనంతరం దాతల సహ కారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మొగిలిపేట మండల కేంద్రంగా ప్రకటించాలి

సోషల్ మీడియా ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి వినతి

మల్లాపూర్, మార్చి 9: మల్లాపూర్ మండలంలో అతి పెద్దా గ్రామమైనా మొగిలిపేటను మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్థుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోషల్ మీడియా ద్వారా వినతి పత్రాన్ని పంపారు. శనివారం గ్రామానికి చెందిన మోత్కూరి మురళిగౌడ్ అను విద్యవేత, సామాజిక సేవకుడు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రులు, నాయకులకు సోషల్ మీడియా ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అతి పెద్దా గ్రామమైనా మొగిలిపేట అభివృద్ధిలో వెనుకబడి ఉందని, గ్రామం చుట్టూ ఉన్న 11 గ్రామాలను కలుపుతూ మండల కేంద్రంగా ప్రకటించడానికి అన్ని అర్హత కలిగి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే చుట్టు ఉన్న గ్రామాలు కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ మీల్స్ అందజేత



అల్పాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల, మార్చి 9 : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఉచిత అల్పాహారం పంపిణీ నిర్వహిస్తున్నారు. 24 రోజుల నుంచి నిర్వహిస్తున్న అల్పాహార కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణానికి చెందిన కౌన్సిలర్, లయన్స్ పీఆర్‌సీ ఆడెపు కమల-మధు దంపతులు ఉచిత అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్ మాట్లాడారు. పట్టణంలో ఎవరైనా క్లబ్‌కు రూ. 2000 చెల్లిస్తే వారి పేరు మీద ఉచిత అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలి పారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెళ్లి, పుట్టినరోజు కార్యక్రమాలను నిర్వహించి వారి పేరుపై ఉచిత అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో లయన్స్ క్లబ్ సభ్యులు ఉషా కిరణ్, మండలోజీ రవీందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



జీరో బిల్లు చూపెడుతున్న రైతు

ఎండపల్లి, మార్చి 9: గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంట్ బిల్లు అమలు అయినందుకు గాను మండలంలోని మారేడుపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలలో నాలుగు అమలు అయినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచారు. బీసీ సెల్ మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్, రాయమల్లు, రఘుపతిరెడ్డి, సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

గంభీరావుపేట, మార్చి 9 : మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ మండలస్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించ తలపెట్టిన సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటు, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణాలు.. రథోత్సవాలు

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



నేరెళ్ల సాంబశివుని ఆలయం రథోత్సవంలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ధర్మపురి, మార్చి 9: ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆకాంక్షించారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలోని శ్రీ సాంబ శివుని ఆలయాన్ని శనివారం సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయం అర్చకులు పర్వతగిరి ప్రశాంత్ శాలువా కప్పి, స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆలయ కమిటీ చైర్మన్ కాసారపు రాజాగౌడ్, వైస్ చైర్మన్ జాజాల రమేష్, ఎంపీటీసీ రెడ్డవేని సత్యం పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని శ్రీ పంచముఖ లింగేశ్వర స్వామి రథోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. రథంలో శివపార్వ తుల ఉత్సవాలను ఉంచి గుడి చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదానంలో సుమారు 5 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వార్డు కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెగడపల్లి : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజ రాజేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాజన్న రథోత్సవ వేడుకలు అంగరం గ వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహోత్స వాలలో బాగంగా చివరి రోజున ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పల్లకి శోభాయాత్ర నిర్వహించి, రుద్రహోమం, బలిప్రదానం మహాపూ ర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల విగ్రహాలను రథంపై ఉంచి శోభాయమానంగా నిర్వహించారు. మండల కేంద్రానికే చెందిన గంగుల కొమురెల్లి కుటుంబ సభ్యుల సహకారంతో ఆయలకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న దానం నిర్వహించారు. ఉత్సవాలలో ఆలయ కమిటీ చైర్మన్ భూమాడి గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బైర పోచయ్య, కమిటీ పాలక మండలి, తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, ఎంపీటీసీ బొమ్మెన జమునస్వామి, శివ దీక్షాపరుల పాల్గొన్నారు.

● పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర, స్వామి వారి రథోత్సవ వేడుకలలో భాగంగా శనివారం ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. స్వామి వారి చిత్రపటం అందించి శాలువాతో సత్కరించారు.



పెగడపల్లిలో రాజన్న రథోత్సవం

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలోని శివాలయంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జాగారణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి వరకు భజన కార్యక్రమాలను జరిపి కల్యాణ మహోత్సవాన్ని గ్రామస్థులు ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు శివపార్వతుల కల్యాణం జరిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం జరుపగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్ తుక్కారాం గౌడ్, ఎంపీటీసీ ప్రియాంక-సురేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకొని బ్రహ్మేంద్రస్వామి, గోవిందామాంబల కల్యాణం స్వర్ణకారులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శివరాత్రి సందర్భంగా అర్ధరాత్రి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి, వైష్ణవి దంపతులతో పురోహితుల వేదమంత్రోత్సరణల మధ్య వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందామాంబల కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకను తిలకించారు. వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొనగా పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా పురోహితులు ఆశీర్వదించి తీర్థాప్రసదాలు అందజేశారు. అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా మేళతాళాల మధ్య ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఓజ్జెల బుచ్చిరెడ్డి, నాయకులు నాంపల్లి సింహాద్రి, దురుశెట్టి నాగరాజ్ నాంపల్లి సంజీవ్, గిరిధర్, కోటగిరి సంతోష్, శ్రీధర్, నాంపల్లి మారుతి, తునికి భూమయ్య, కృష్ణమాచారి, మహేష్, శ్రీనివాస్, మహేందర్, రామానుజన్, వెంకటేష్, నాగరాజు, ప్రవీణ్, చిన్నఅంజయ్య, రవి, విజయ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని చెప్యాల గ్రామ శివారులోని చెరువు కట్ట పై ఉన్న శివాలయంలో శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని శనివారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై పుర ప్రముఖుల ఆధ్వర్యంలో శివ కల్యాణానికి ముందు గ్రామంలోని హన్మాన్ దేవాలయం నుంచి ఉత్సవ మూర్తులను ఆలయం వరకు తీసుకవచ్చారు. అనంతరం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 1500 మందికి ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ మాజీ సర్పంచు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బుచ్చి రాములు, పుండరీ కం, సత్తిరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ గ్రామంలో గల గుట్ట రాజ రాజేశుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాల సమయంలో ఉత్సవ ముహూర్తులైన శివ పార్వతులను అందంగా అలంకరించి శావపై ఆశీనులగావించి గ్రామ పుర వీధులలో ఊరేగింపుగా భక్తుల దర్శనార్థం శావను తింపారు. భక్తులు ఉత్సవ ముహూర్తులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ తాజ సర్పంచ్ శ్రీమతి జితేందర్ యాదవ్, ఎంపీటీసీ మల్లీశ్వరి తిరుపతి పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని పోతారం గ్రామ శివారులోని లోంక రామన్న జాతర మహోత్సవం శనివారం ఘనంగా సాగింది. శివరాత్రి మహాపర్వదినం పురస్కరించుకొని మరుసరి రోజు నిర్వహించు జాతర మహోత్సవం ఘనంగా సాగింది. వేములవాడలో కోలువు దేరిన రాజ రాజేశ్వర స్వామి అక్కడి భక్తులను తాకిడికి తట్టుకోలేక లోంక రామన్న సన్నిధికి వచ్చి సేద తీరుతాడన్న నమ్మకంతో ఇక్కడ భక్తులు జాగర మహోత్సవం నిర్వహిస్తుంటారు. జాగర మహోత్సవంలో భక్తులు చేసిన భజన కార్యక్రమంలో లోంక రామన్న దేవాలయ ప్రాంతం శివ నామ స్మరణతో మారుమోగింది. దేవాలయంలో పూజలను నిర్వహించిన వేదపండితులు శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై కళ్యాణంను జరిపారు. కళ్యాణానికి వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. విప్ ఆది శ్రీనివాస్‌కు దేవాలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.



కోడె మొక్కు, చెల్లిస్తున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మల్లాపూర్: శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా మల్లాపూర్ శివారులో గల సోమేశ్వరస్వామి కొండ కింద స్వామి రథోత్సవ కార్యక్రమం శని వారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి దర్శ నానికి భక్తులు బారులు తీరారు. స్వామి దర్శించుకోని శివరాత్రి దీక్షను వదిలి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు జరిపి మొక్కులు చె ల్లించుకున్నారు. రాత్రి స్వామి వారిని ఏర్పాటు చేసిన రథోతంలో ఏర్పాటు చేశారు. వేలాది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని వైభవంగా జరిపారు. డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్ సిబ్బంది, జవానులతో బందోబస్తు నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మొగిలిపేట గ్రామంలోని కోటి లింగేశ్వరాలయంలోని స్వామి వారి కల్యాణాన్ని పురోహితులు వేదమంత్రోత్సవాల మధ్య వైభవంగా జరిపారు. స్వామి వారి కల్యాణంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

బుగ్గారం: మండల కేంద్రంలో శనివారం శ్రీ సాంబశివ నాగేశ్వరాలయంలో శివభక్తులు, స్వాములు సాంబశివ రథోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రథోత్సవం దినోత్సవ సందర్భంగా ఉదయం నుంచి సాంబశివ ఆలయంలో స్వాములు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ వేడకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని శ్రీ సాంబ శివా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ బృందం రథోత్సవం సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎలాంటి ఆవంచానియ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో



ఆది శ్రీనివాస్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు



బుగ్గారంలో రథోత్సవం పాల్గొన్న భక్తులు

డాక్టరేట్ పొందిన వ్యక్తికి సన్మానం

కోరుట్ల, మార్చి 9 : అసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన పేట భాస్కర్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించి అభినందించారు. పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పేట భాస్కర్‌ను పూలమాలలు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు నాయకులు తిరుమల గంగాధర్, మ్యాకల నర్సయ్య, మచ్చ కవిత, మహ్మద్ షేక్, ఎంబేరి నాగభూషణం పాల్గొన్నారు.

పొలాసలో పౌలస్తేశ్వర స్వామి ఊరేగింపు

జగిత్యాల రూరల్, మార్చి 9: మండలంలోని పొలాస గ్రామంలో శ్రీ పౌల స్తేశ్వర స్వామి సేవా కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పొలాస గ్రామ పురవీధుల గుండా స్వామివారిని ఊరేగింపు చేశారు. ఈకార్యక్రమంలో ఉత్సవకమిటీ అధ్యక్షుడు వెంకటేష్, ఆలయ ఈవో వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ కొండ్రరవి, పూజారులు గోపాలశర్మ, గోవర్ధనశర్మ, ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపాలి

జగిత్యాలరూరల్, మార్చి 9 : జీరో టిల్లేజీ విధానంలో మొక్కజొన్నసాగుపై రైతులు మొగ్గుచూపాలని జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన బద్దం రాజేందర్‌రెడ్డి వరి మాగన్నుల్లో దుక్కి దున్నకుండా సాగుచేసిన మొక్కజొన్న పంటను శనివారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏఇఓ నాగరాజు, రైతులుపాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి, మార్చి, 9 : నియోజక వర్గంలోని యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంతో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేలాను యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ కోరుట్ల నియోజక వర్గ యువనేత ఓజ్జెల శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని 23వ వార్డులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని యువతకు ఉపాధి కల్పించడానికి మెట్‌పల్లిలోని వెంకటరెడ్డి గార్డెన్‌లో ఈనెల 11న నిర్వహించే మెగా జాబ్ మేళాకు సంబంధించిన వివరాలను తెలిపారు. కోరుట్ల నియోజక వర్గంలోని యువతీ, యువకులకు ఉపాధి కల్పించడం కోసం కోరుట్ల ఎమ్మెల్యే వివిధ కంపెనీలతో మాట్లాడి జాబ్ మేళాను ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. జాబ్ మేళాలలో మొత్తం 50 కంపెనీలు పాల్గొని 2000 మందిని ఎంపిక చేస్తాయన్నారు. ఇందులో పది తరగతి, ఇంటర్, డిగ్రీ, ఏదైనా పీజీ చదివిన నిరుద్యోగులు, అర్హులన్నారు. జాబ్‌మేళాలలో పాల్గొనే వారు 9948335533, 7893636313 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్‌ను ఈనెల 11 ఉదయం 10 లోపు చేసుకోవాలన్నారు.

ఆసాములకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 9 : ఆసాములు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో భద్రావతి సంఘం ఆవరణలో ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శనివారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కోసం సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో భిక్షటాన చేసి నిరసన తెలపనున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని వేడుకున్నారు. ఈ దీక్షలో సభ్యులు గాజుల నరేష్, బచ్చురాములు, బూర కుమార్, పోరండ్ల శ్రీనివాస్, తెల్లభాస్కర్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కథలాపూర్, మార్చి 9 : మండలంలోని భూషన్‌రావుపేట గ్రామంలోని రామాలయంలో చోరీ జరిగినట్లు శనివారం గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని రామాలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని ఎత్తుకవెళ్లినట్లు గ్రామస్థులు తెలి పారు. విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానిక ఎస్ఐ నవీన్ సంఘటన చేరుకుని పరిశీలన జరిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శివాలయాల్లో అన్నదానం

మేడిపల్లి, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో శివాలయాలల్లో అభిషేకము, మహా పూర్ణహుతి, అన్నదానము, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొంబర్రావుపేటలో శివాలయంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట ధర్మరెడ్డి, తిరుపతిరెడ్డి, శంకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జీవన్ రెడ్డి, ఆలయ కమిటీ వారు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

మేడిపల్లి, మార్చి 9: రామకృష్ణ డిగ్రీ, వీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటరీలు పోరుమల్ల గ్రామంలో శ్రమదానం చేశారు. విద్యార్థులు గ్రామంలోని పారిశుద్యం పనులు నిర్వహించి అనంతరం ఓంకారేశ్వర ఆలయంలో జరిగిన అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా వడ్డన చేశారు. విద్యార్థులను గ్రామ పెద్దలు తిరుపతిరెడ్డి అభినందించారు. వారి వెంట ప్రిన్సిపల్ రాజేందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జగిత్యాలరూరల్, మార్చి 9 : మహిళలు అన్ని రం గాల్లో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోళి శ్రీలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా పరుగుపందెంలో ప్రతిభ కనబరిచిన సాంఘికసం క్షేమ కళాశాల విద్యార్థినులను ఎంపికచేసి నెహ్రూశక్తి ఫిట్నెస్‌రన్ వారు ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శనివారం బహుమతలు ప్రదానం చేశారు. ఈసంధర్భంగా శ్రీలత మాట్లాడుతూ విద్య, వ్యాపారం, రాజకీయం ఇలా అన్ని రంగాల్లో మహి ళలు కీలకపాత్ర పోషించినప్పుడే గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ అనూష, భోనగిరి దేవయ్య, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొడిమ్యాల, మార్చి 9 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమాపంలో కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అన్నారు.

వైభవంగా బుగ్గ రాజరాజేశ్వరస్వామి జాతర



ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, మార్చి 9: రుద్రంగి మండల కేంద్రంలో వెలసిన బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం శివరాత్రి తెల్లవారుజామున ఆలయంలో ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్ స్వామివారిని దర్శించుకున్నారు. శివ భక్తుడు గోడికారి హిరోజి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, ప్యాక్స్ డైరెక్టర్ కెసిరెడ్డి నర్సారెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, సామ మోహన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఇప్ప మహేష్, పల్లి గంగాధర్, అభిలాష్, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మానాల శంభు లింగేశ్వరస్వామి కల్యాణం

రుద్రంగి మండలం మానాల గ్రామంలోని భవానీ శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జాతరలో భాగంగా భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శంభు లింగేశ్వర స్వా మికి ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ పిసిరి చిన్న భూమయ్య, మాజీ సర్పంచ్ మానస, జక్కు మోహన్, తిక్క భూమన్న, జక్కు వంశీ, బాదనవేణి రాజారాం, రవీందర్ పాల్గొన్నారు.